ప్రజాశక్తి
గురువారం 13 నవంబర్ 2025 5 అనంతపురం

నిధుల గోల్‌మాల్‌పై విచారణకు డిమాండ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పశుసంవర్ధక శాఖ జిల్లా కార్యాలయంలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఖర్చు చేయాల్సిన డబ్బులు వ్యక్తిగత అకౌంట్లకు మళ్లించిన వారిపై విచారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పాడి పశువులకు, గొర్రెలకు వ్యాధులు సోకినప్పుడు పశువుల ఆసుపత్రులకు వెళితే డాక్టర్లు ప్రయివేటు మందులు షాపులకు వెళ్లి మందులు తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. చిన్న చిన్న మందులు కూడా రాసివ్వడం ఈ మధ్యకాలంలో పెరిగిపోయిందన్నారు. ఏమైనా రైతులు నిలదీసి అడిగితే ప్రభుత్వం నుంచి నిధులు రాలేదని బుకాయిస్తున్నారని విమర్శించారు. వచ్చిన నిధులు జిల్లా పశుసంవర్ధక శాఖలో కొందరు అధికారులు వ్యక్తిగత ఖాతాలకు మళ్లించుకొని అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుని డబ్బులు రికవరీ చేసి రైతులకు, గొర్రెల మేకల పెంపకదారులకు అవసరమైన మందులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సమస్యల వలయంలో సంక్షేమ హాస్టళ్లు

కనీస సౌకర్యాలు కరువు ఇబ్బందుల్లో విద్యార్థులు పట్టించుకోని పాలకులు

కనీస సౌకర్యాలు లేని కాలేజీ బాయ్స్ హాస్టల్

ప్రజాశక్తి - రాయదుర్గం రూరల్

రాయదుర్గం పట్టణంలోని బిసి వసతిగృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న బీసీ వసతిగృహం, కొలిమి వీధిలో ఉన్న బీసీ కాలేజ్ బాయ్స్ హాస్టల్‌లో అరకొర వసతులతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

పట్టణంలోని కనేకల్‌రోడ్‌లో ఉన్న ఎస్సీ టు హాస్టల్ ఐదో తరగతి నుండి పదవ తరగతి దాకా చదివే విద్యార్థులు 73 మంది ఉన్నారు. 32 మంది విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో చేరినట్లు వార్డెన్ రామాంజనేయులు రెడ్డి తెలిపారు. గత ఏడాది విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయగా, కొత్తగా వచ్చిన విద్యార్థులకు దుప్పట్లు లేవు. దీంతో ఇంటి నుండి తెచ్చుకున్న దుప్పట్లనే 32 మంది విద్యార్థులు ఉపయోగించుకుంటున్నారు. గతంలో డిస్ట్రిక్ పర్చేస్ కమిటీలు ఉండేవి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నిత్యవసరాలు ధరల మార్పులకు అనుకూలంగా ఉండేది. 2024 జూన్ నుండి సెంట్రలైజ్డ్ జీవో అమలులోకి వచ్చింది. దీంతో ప్రభుత్వమే మెస్ చార్జీల పెంపు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. సంక్షేమ వసతిగృహాల్లో ఉండే విద్యార్థుల మెస్‌ఛార్జీలు 2023లో అమలులో ఉన్నవే. దీంతో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆహారం పెట్టేందుకు నిర్వహణ కష్టమవుతుంది. ఉదాహరణకు ఒక విద్యార్థికి ఆహారం పెట్టేందుకు 45.90 రూపాయల ప్రకారం చెల్లిస్తుండగా ప్రస్తుతం ఆ వ్యయం 70 రూపాయల దాకా పెరిగింది. ఇలాంటి ఆర్థిక వ్యత్యాసాన్ని భర్తీ చేసేందుకు వసతిగృహాల్లో సమస్య ఏర్పడుతోంది. ఉన్న మెనూ ప్రకారం ఓ గుడ్డు ధర అప్పట్లో నాలుగు రూపాయలుండగా ప్రస్తుతం 5.50 రూపాయల నుండి ఆరు రూపాయలు దాకా ఉంది. డొమెస్టిక్ సిలిండర్ ధర 850 రూపాయల నుండి 922 రూపాయలకు చేరింది. ఇలాంటి ఆర్థిక నష్టాన్ని పూడ్చుకునేందుకు, వ్యయ భారాన్ని తగ్గించుకొనేందుకు వసతిగృహం నిర్వాహకులు ఆర్థిక , ఆహార సర్దుబాట్లు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీసీ బాలుర వసతిగృహంలో 49 మంది విద్యార్థులు ఉన్నారని వార్డెన్ సత్యనారాయణ తెలిపారు. ఇక్కడ ఆర్డీటీ భవనంలో వసతిగృహాన్ని నిర్వహిస్తున్నారు. ఆరు అటాచ్డ్ బాత్రూంలు ఉన్నాయి. పాతవి కావడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. స్నానపు నీరు బయటకు వెళ్లేలా పైపులు ఉండడంతో అసౌకర్యంగా మారింది. తాగునీరు కోసం ఓ గదిలో సింటెక్స్ ద్వారా బయట రెండు కుళాయిలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు కుళాయిల ద్వారా ఉన్న గ్లాసులతో నీరు తాగాల్సి ఉంది. వంటగది ఇరుకుగా ఉంది. కొలిమి వీధిలో ఉన్న బీసీ కాలేజ్ బాయ్స్ హాస్టల్ అసౌకర్యాల మధ్య నిర్వహిస్తున్నారు. 65 మంది దాకా విద్యార్థులు ఉన్నారు. బాడుగ భవనం కావడంతో ఉన్నదాంట్లోనే అరకొర వసతులతో నిర్వహిస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న వార్డెన్ పనితీరు, నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ఇటీవల విద్యార్థి సంఘం నాయకులు ఆందోళన చేయడంతో వివాదాస్పదమైంది. దీంతో సత్యనారాయణకు అదనపు బాధ్యతలు అప్పగించారు. బాత్రూంలు అధ్వానంగా ఉన్నాయి. ఇరుకైన ప్రదేశంలో విద్యార్థులు స్నానాలు చేస్తున్నారు. నిద్రించే గది వెంటిలేటర్‌కు తలుపులు లేకపోవడంతో చలికి విద్యార్థులు వణికిపోతున్నారు. అరకొర వసతులతో వసతిగృహాల్లో ఉంటూ విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు వసతిగృహాల్లో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మెరుగైన వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది.

విద్యార్థులు స్నానాలు చేసే ప్రదేశం

తాడిపత్రిలో రాజకీయ వేడి

ఇరు పార్టీల నాయకుల కార్యక్రమాలతో ఉద్రిక్త వాతావరణం

మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి - తాడిపత్రి

మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన నిరసన ర్యాలీ మరోవైపు, ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనల కార్యక్రమాలు నిర్వహణతో తాడిపత్రిలో రాజకీయ వేడి ఏర్పడింది. వైసీపీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ తాడిపత్రిలో ర్యాలీ నిర్వహించేందుకు ఈనెల 8న జిల్లా ఎస్పీ, తాడిపత్రి సబ్ డివిజన్ ఏఎస్పీని అనుమతులు కోరగా 11వ తేదీ రాత్రి నియోజకవర్గంలోని ఏదైనా ఒక మండలంలో తాడిపత్రి పట్టణం మినహా నిర్వహించుకోవాలని సూచించారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి యాడికిలో ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. యాడికి ర్యాలీ కార్యక్రమానికి వెళ్లేందుకు పెద్దారెడ్డి బయలుదేరుతుండగా యాడికిలో టిడిపి వారు పెద్ద ఎత్తున జన సమీకరణ కావడంతో శాంతి భద్రతల సమస్య కారణంగా పెద్దారెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. గృహనిర్బంధం చేశారు. తనను గృహ నిర్బంధం చేయడంపై మాజీ ఎమ్మెల్యే పోలీసులపై అగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు అనుమతి పొంది కార్యక్రమానికి వెళ్తుంటే అడ్డుకోవటమేందని ఆయన ప్రశ్నించారు. శాంతి భద్రతల సమస్య ఉంటే రక్షణ కల్పించాలి గాని అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. అనంతరం పెద్దారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ తాడిపత్రి నియోజకవర్గం లో గ్యాంగ్‌స్టర్స్‌గా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రతిరోజు నియోజకవర్గంలో ఏదో ఒక చోట వైసీపీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారన్నారు. వైసీపీ నాయకులు కార్యకర్తలు దాడికి గురవుతున్నా కేసు నమోదు చేసుకోకుండా బాధితులపైనే పోలీసులు కౌంటర్ కేసులు కడుతున్నారని ఆరోపించారు. వైసీపీ నాయకులు కార్యకర్తలు తాడిపత్రిలో చాలా ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వ్యవస్థను శాసించే స్థాయిలో జేసీ కుటుంబం ఉంటున్నా దానిని ఉన్నతాధికారులు పట్టించుకోకుండా పోతున్నారని విమర్శించారు. చంద్రబాబు పాలనలో అధికారులు చైర్మన్ ఎమ్మెల్యేల మెప్పుకోసం పనిచేస్తున్నారని ఆరోపించారు. తాడిపత్రిలో ఏ పాలన జరుగుతుందో సీఎం గుర్తించాలన్నారు. తనకు ప్రాణహాని ఉందంటూ కార్యక్రమాలకు హాజరు కాకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని ఎవరి వల్ల ప్రాణా హాని ఉందని మాత్రం చెప్పడం లేదని అన్నారు.

తాడిపత్రిలో ప్రశాంతంగా ఉంది : ఎఎస్పీ

తాడిపత్రిలో ప్రశాంతత వాతావరణం కొనసాగుతుందని ఎక్కడ ఉద్రిక్త పరిస్థితి లేదని ఏఎస్పీ రోహిత్ కుమార్ తెలిపారు. రెండు పార్టీల కార్యక్రమాలు ఒకేరోజు వచ్చాయని అందువల్ల ప్రశాంతతకు భంగం కలుగకుండాకొన్ని చర్యలు చేపట్టాల్సి వచ్చింది అన్నారు. యాడికి లో వైసీపీ కార్యక్రమానికి అనుమతి ఉన్నా అక్కడ టిడిపి కార్యకర్తలు వారి కార్యక్రమాల కొరకు జనాన్ని సమీకరించుకున్నారని శాంతిభద్రతల విఘాతం కలుగకుండాఉండేందుకే పెద్దారెడ్డిని అడ్డుకోవడం జరిగిందని తెలిపారు

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - గుత్తి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయరాం

రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. స్థానిక నేమితాబాద్ హౌసింగ్ లేఅవుట్ లో మన ఇళ్లు, మన గౌరవం పథకం కింద నిర్మించిన సామూహిక గృహాలను ఎమ్మెల్యే, ఎంపీతో పాటు కలెక్టర్ ఓ.ఆనంద్, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ జి.వెంకట శివుడు యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీ మాట్లాడుతూ కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సిసి రహదారుల నిర్మాణానికి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేస్తామన్నారు. అనంతరం అనంతపురం రోడ్డులో రూ. 20 లక్షల నిధులతో నిర్మించిన తాగునీటి పైప్‌లైన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, హౌసింగ్ పీడీ శైలజ, డిఎల్‌డిఒ విజయలక్ష్మి, ఏపీఆర్ఓ సూర్య నారాయణరెడ్డి, తహశీల్దార్ జి.పుణ్యవతి, మున్సిపల్ కమిషనర్ బి.జబ్బారమియా, ఎంపిడిఒ డి.ప్రభాకర్, హౌసింగ్ డిఇ షాషావలి, ఎఇ సూర్యనారాయణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ జి. సూర్యప్రతాప్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు చికెన్ శీనాయాదవ్, ఎంపీటీసీ జింకల నారాయణస్వామి, నాయకులు హిమబిందు,బి. మారుతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కుతీసుకోవాలి

వైసీపీ జిల్లా అధ్యక్షులు 'అనంత' డిమాండ్

అనంతపురంలో హోరెత్తిన 'ప్రజా ఉద్యమం' నిరసన ర్యాలీ

ర్యాలీలో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత తదితరులు

ప్రజాశక్తి -అనంతపురం

ప్రయివేటుకు లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటు పరం చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. 18 నెలల కూటమి కాలంలో మట్టి మాఫియా, ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియా, రేషన్ మాఫియా చేయడమే కాకుండా ఇప్పుడు మెడికల్ మాఫియా చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం అనంతపురంలో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో 'ప్రజా ఉద్యమం' నిరసన ర్యాలీ నిర్వహించారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి టవర్‌క్లాక్ మీదుగా ఆర్‌డిఒ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. పెద్ద ఎత్తున యువత, విద్యార్థులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఈ ర్యాలీకి తరలివచ్చారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దోచుకోవడం..దాచుకోవడమే లక్ష్యంగా ముందుకు వెళ్తోందన్నారు. వైఎస్ జగన్ అధికారంలో ఉన్నప్పుడు విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. రాష్ట్రంలో రూ.8 వేల కోట్లతో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణాలకు శ్రీకారం చుట్టి ఏడు కళాశాలలను అందుబాటులోకి తెచ్చారని గుర్తు చేశారు. మిగిలిన 10 మెడికల్ కాలేజీల్లో 30 శాతం నుంచి 70 శాతం వరకు పనులు చేసినట్లు చెప్పారు. కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చాక 10 కళాశాలలను తన బినామీలు, బంధువులు, వర్గీయులకు కట్టబెట్టేందుకు ప్రైవేట్‌పరం చేయడానికి జీవో విడుదల చేశారని ఆరోపించారు. దీని కారణంగా పేద ప్రజలకు వైద్య విద్యతో పాటు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుబాటులో ఉండదని తెలిపారు. కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంతో ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణకు ప్రజా ఉద్యమం కొనసాగుతోందని చెప్పారు. ఇప్పటికే కోటి సంతకాల సేకరణకు పార్టీలకు అతీతంగా మద్దతు వస్తోందని అన్నారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు ఉద్యమం చేస్తామని, న్యాయపోరాటం కూడా ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా చంద్రబాబు మేల్కొని జీవోను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ర్యాలీ అనంతరం ఆర్‌డిఒకార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

యువత అన్నిరంగాల్లో రాణించాలి

యువజనోత్సవాల్లో ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

యువజనోత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

ప్రస్తుత సమాజంలో యువత అన్నిరంగాల్లో రాణించాలని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ ఆన్ సెట్, అనంతపురం, ప్రగతిపథం యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని తల్లి తండ్రుల ఆశయాలు నెరవేర్చాలన్నారు. కేవలం చదువు మాత్రమే కాకుండా సామాజిక బాధ్యతతో ఉండి ప్రతి ఒక్క యువత అనేక రంగాలలో రాణించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువత సంక్షేమాభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వర్తిస్తూ ప్రోత్సహిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆన్ సెట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి యన్.రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ జానపద నత్యాలు జానపద గేయాలు, స్టోరీ రైటింగ్, ఫోయం రైటింగ్, డిక్లమేషన్, పెయింటింగ్, సైన్స్ మేళా వంటి పోటీలలో గెలుపొందిన యువతి యువకులను రాష్ట్ర స్థాయికి పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సహదేవుడు, సెంట్రల్ యూనివర్సిటీ ఫాకల్టీ డాక్టర్ ఓ.ప్రణతి, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి జీవన్ కుమార్, కె.జయ మారుతి, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్, ఆన్‌సెట్ మేనేజర్ శ్రీనివాసులు, జియల్‌ఎన్.ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఎర్రమట్టి తరలింపు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఊరికి చెరువులు ఎంతో ఉపయోగకరమని భావించిన పెద్దల ఆశయాలకు భంగం కలిగించే రీతిలో చెరువులలోని మట్టి, ప్రభుత్వ భూముల్లో ఎర్రమట్టిని స్వార్థపరులు తరలిస్తున్నారు. ఆత్మకూరు మండలంలో ఎర్రమట్టి దందా కొనసాగుతోంది. చెరువులలో మట్టి పూడిక తీయడానికి జిల్లా అధికార యంత్రాంగం నుంచి అనుమతులు తీసుకొని, మార్గదర్శకాల మేరకు మాత్రమే మట్టి తవ్వకాలు చేపట్టాల్సుంది. స్థానికంగా ఉన్న సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల మట్టి తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. సమాజానికి విఘాతం కలిగించే సందర్భం ఏదైనప్పటికీ, కట్టడి చేయాల్సిన పోలీస్ యంత్రాంగం, రెవెన్యూ యంత్రాంగం, పంచాయతీరాజ్ శాఖలు పట్టించుకోవటం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. మండలంలోని ఆత్మకూరు, పడమటి యాలేరు, వేపచెర్ల, గోరిదిండ్ల గ్రామాల్లో నిత్యం మట్టి, ఎర్ర మట్టి తరలింపు యథేచ్ఛగా సాగుతుంది.తాజాగా మండలంలోని సోమవారం ఒక గ్రామపంచాయతీ కి చెందిన చెరువులో మట్టి, ఎర్రమట్టి, మొరం తవ్వకాలను చేపడుతున్నారు. అయితే సంబంధిత అధికారులు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని వెంటనే వదిలేశారు. మండలంలోని ఇటీవల సిసి రోడ్డు నిర్మాణం కోసం రోడ్డు పనులు చేస్తున్న కొందరు అధికార పార్టీ నాయకులు పలు చెరువుల నుండి మట్టి తరలిస్తున్నారు.. ఉదయం సాయంత్రం వేళల్లో నెల రోజుల నుండి ఇష్టారీతిన మట్టి తరలింపు జరుగుతోందని ఆయా గ్రామస్తులు తెలిపారు. రహదారుల నిర్మాణానికి ఇరు ప్రక్కల సైడ్ బర్మ్‌లను ఏర్పాటు చేయడానికి మట్టి అవసరం ఏర్పడుతుండగా, సదరు కాంట్రాక్టర్లు అందుబాటులో గల అడవుల్లో లేదా చెరువుల్లో మట్టిని తరలించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెరువుల్లోని మట్టిని తవ్వడానికి ముందస్తు అనుమతులు తప్పనిసరి. చెరువు పరిస్థితుల నేపథ్యంలో పూడిక మట్టి లాగా తీయడానికి మాత్రమే అవకాశాలు ఉండగా, అందుకు విరుద్ధంగా జెసిబి ప్రొక్లైన్ల ద్వారా గోతుల మాదిరిగా తవ్వుతూ, భారీ టిప్పర్ల ద్వారా ఎర్రమట్టి తరలిస్తున్నారు. ఇంతజరుగుతున్నా సంబందిత అధికారులు పట్టించుకోవటం లేదు. కాంట్రాక్టర్ల అక్రమ మట్టి తరలింపు వెనుక కొందరు అధికార పార్టీ నాయకులు, అధికారుల హస్తం ఉందన్న ఆరోపణలు వినపడుతున్నాయి.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

యుటిఎఫ్ నాయకులు రామప్పచౌదరి, రాఘవేంద్ర

ప్రజాశక్తి-గుంతకల్లు

సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి, జిల్లా కోశాధికారి రాఘవేంద్ర అన్నారు. బుధవారం స్థానిక సరోజినీనాయుడు మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో గుంతకల్లు అర్బన్ శాఖ అధ్యక్షులు రామకృష్ణ అధ్యక్షతన యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు చేసి ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. 12వ పిఆర్సీ కమిషన్‌ను పునరుద్ధరించాలని, 29 శాతం ఐఆర్ ప్రకటించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అర్బన్ శాఖ గౌరవాధ్యక్షులుగా ఎస్.శంకరయ్య, అధ్యక్షులుగా సి.ఎల్లన్న, సహాధ్యక్షులుగా పివి.విశాలాక్షి, కె.సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా వై.రమేష్, కోశాధికారిగా పెన్నయ్య, మహిళా సబ్ కమిటీ కన్వీనర్‌గా వి.లావణ్య, కో కన్వీనర్‌గా సరిత, రూరల్ శాఖ గౌరవాధ్యక్షులుగా ఎం.వెంకటేశ్వర్లు, అధ్యక్షులుగా జి.గిరిబాబు, సహాధ్యక్షులుగా డి.మాధవి, శ్యాంనాయక్, ప్రధాన కార్యదర్శిగా జి.రామాంజనేయులు, కోశాధికారిగా జి.చంద్రశేఖర్, మహిళా సబ్ కమిటీ కన్వీనర్‌గా జి.కల్పనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ రాజ్‌కుమార్, సీనియర్ నాయకులు శ్రీనివాసులు, రవిబాబు, రామ్మోహన్, రేవన్న, సిద్దయ్య, శంకర్‌నాయక్, రవిప్రసాద్, అబ్దుల్ రఫీ, జయదుర్గ, కస్తూరి పెద్దయ్య, ఇబ్రహీం, ఖలీల్, చిన్నరంగన్న, విశ్వేశ్వరబాబు, తిమ్మారెడ్డి, రాజు, గురునాథ్, మురళీకృష్ణ, చంద్రారావు, జయలక్ష్మి, చంద్రశేఖర్, చిరంజీవి, అనీస్, కృపా, మోహన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాలను వినియోగించుకోండి

కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి-గుత్తి

రైతులు డ్రిప్ పరికరాలను సక్రమంగా వినియోగించుకోవాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సూచించారు. బుధవారం మండలంలోని కరిడికొండ, ఉబిచెర్ల గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న చీనీ, బంతిపూలు, దానిమ్మ తోటలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో కష్ట,నష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు డ్రిప్ పరికరాలను వినియోగించుకుని పంటలను సాగు చేయాలన్నారు. నీటిలో కరిగే ఎరువులను వినియోగించేలా రైతులకు శిక్షణ ఇవ్వాలని ఎపిఎంఐపి పీడీ రఘునాధరెడ్డిని ఆదేశించారు. చీనీపంటలో కొత్త రకాలు ప్రోత్సహించేందుకు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఉద్యానశాఖ డీడీ ఉమాదేవికి సూచించారు. అనంతరం గుత్తి కోట వద్ద ఉన్న దత్త మండలాల కలెక్టర్ సర్ థామస్ మన్రో సమాధిని కలెక్టర్ సందర్శించారు. గుత్తి కోటకు రోడ్డు మార్గాన్ని మ్యాప్ ద్వారా పరిశీలించారు. తక్కువ ఖర్చుతో పురాతన కట్టడాలకు ఇబ్బంది లేకుండా రోడ్డు వేసేలా ప్రణాళిక రూపొందించాలని పురావస్తు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి.పుణ్యవతి, మండల వ్యవసాయ అధికారి ముస్తాక్‌అహ్మద్, హెచ్ఒ మిత్రవిందా మాధవి, తదితరులు పాల్గొన్నారు.

చీనీతోటను పరిశీలిస్తున్న కలెక్టర్ ఓ.ఆనంద్

14 పూర్వ విద్యార్థుల సమావేశం

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 14న శుక్రవారం పూర్వ విద్యార్థి సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘంగా ఏర్పడి రిజిస్ట్రర్ చేసుకున్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలో శుక్రవారం స్థానిక కళాశాలలో మొదటిసారి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బహిరంగ ప్రకటన

కార్యనిర్వహణాధికారి కార్యాలయము
శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి దేవస్థానము-పాతూరు
అనంతపురం పట్టణము, అనంతపురం జిల్లా.

పై దేవస్థానము నందు 30/12/2025వ తేది వైకుంఠ ఏకాదశి పండుగ సందర్భంగా ఈ క్రింద తెలిపిన పనులకు గాను కొటేషన్లు ఆహ్వానించడమైనది. సదరు పనుల వివరములను కార్యాలయము నుంచి తెలుసుకొని 4 రోజుల లోపల కొటేషన్లు అందజేయవలయునని కోరడమైనది. సున్నం, పూతలు, లైటింగ్ డెకరేషన్, క్యూలైను, సప్లయర్స్ సామానులు ఏర్పాటు నిమిత్తం.

12/11/2025 — సం/- బి.సుధారాణి, కార్యనిర్వహణాధికారి

మహారాజశ్రీ కదిరి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
S.O.P.No.1/2025
1.కందుకూరి శ్రీరాములు S/o Late K.వేమన్న.
2.కందుకూరి సంధీప్ S/o K.శ్రీరాములు.
3.కందుకూరి అశోక్ S/o K.శ్రీరాములు.
అందరు డోర్.నెం:1/33/10/B.వాణి వీధి, కదిరి టౌన్, శ్రీ సత్య సాయి జిల్లా. ...పిటీషనర్లు
V/s
-Nil- ...రెస్పాండెంటు

బహిరంగ ప్రకటన

పై అర్జీలోని పిటీషనర్లు కె.శ్రీరాములు, కె.సందీప్, కె.అశోక్, పై కోర్టు యందు ఇదివరకే చనిపోయిన కందుకూరి నళిని 1వ పిటీషనరుకు భార్య, 2 మరియు 3లకు తల్లి అయిన ఆమె చనిపోయినందు వలన ఆమె వారసులకు ఆమెకు చెందిన స్థిర, చర ఆస్తులు, బ్యాంకుల యందు మరియు ఆఫీసుల యందు ఆమె పేరుతో వున్నవి అన్నియు పిటీషనర్లుకు చెందాలని పిటీషనర్లు వారసత్వపు సర్టిఫికేట్ (Succession Cerificate) కు కోర్టులో అర్జీ వేసినారు. అర్జీ పై కోర్టులో 11/12/2025వ తేదీకి వాయిదా వేయబడినది. ఎవ్వరికయినా అభ్యంతరములు వున్నచో వాయిదా రోజు తెలుపుకొనవలయునని యిందుమూలముగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా :11/12/2025
స్థలం:కదిరి ఇట్లు
కె.నరసింహులు
పిటీషనర్లుతరపు వకీలు, కదిరి

మహారాజరాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో, అనంతపురము.
E.P.No. 72/2024 in O.S.No.05/2023
Between:
వి.భాగ్యలక్ష్మి ...వాది
మరియు
వి.రామాంజినేయులు ...ప్రతివాది

ప్రతివాదికి నోటీసు

వి.రామాంజినేయులు, తండ్రి వి. తిమ్మప్ప అలియాస్ తిమ్మన్న, ప్రొప్రైటర్: శ్రీ బాలాజీ బోర్వెల్స్, ఇంటి నెం.4-2-531-1, తిరుమలనగర్, యువజన కాలనీ, అనంతపురం పట్టణం మరియు జిల్లా.
ఇందుమూలముగా ప్రతివాదికి తెలియజేయడమేమనగా, పై వాది మీపై తన డిక్రీ మొత్తము రాబట్టుకొనుటకు పై కేసును దాఖలు చేసినారు. మీకు పలుమారు నోటీసులు పంపినను చేరనందున, పై కేసును 19-11-2025వ తేదీకి వాయిదా వేసినారు. కావున మీరు సదరు తేదీనాడు ఉదయం 10.30 గంటలకు ఖుద్దునగానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనంతట పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును అని తెలియజేయబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా:19-11-2025
శ్రీ. బి.రవిప్రసాద్,
వాదిపరం న్యాయవాది, అనంతపురము

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE, TADIPATRI
O.S. No: 434/2024
Between:
Canara Bank.(Rep by its Authorized officer, Branch Manager, Canara Bank, Thimmampalli Branch, Thimmampalli Ananthapuramu Dist)
...Plaintiff
AND
Dasannagari Ramanjaneyulu and another
...Defendants
Notice to Defendant No:1&2
D1: Dasannagari Ramanjaneyulu S/o D. Pedda Hanumanthu, Residing at Aravedu (V), Yallanooru (M), Ananthapuramu Dist.
D2: Reddipalli Raghuramudu S/o R. Hanumanthu, R/at D.No. 3-43, Aravedu (V), Yallanooru (M), Ananthapuramu Dist.
పై నెంబరు కేసులో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తము 23-12-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
K RAMESH BABU,
Advocate, Anantapuramu,
Cell:9398549442

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిలు జడ్జి వారి కోర్టులో
E.P.No: 98/2016, in O.S.NO:224/2012
Between:
D.నరేష్ కుమార్. ...డిక్రీహోల్డర్
V/S
పి. మహమ్మద్ రఫీ ...జడ్జిమెంట్ డెబిటర్

వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజలకు తెలియ జేయడం ఏమనగా, ఈ దిగువ తెలిపిన షెడ్యూలు ఆస్తిని, పై తెలిపిన వాజ్యం నందు గౌరవ కోర్టు నందు తేది 28-11-2025 వ తేదిన ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 05:00 గంటల లోపల వేలము జరుప బడును.కావున ఆసక్తిగల సవాలుదారులు వేలమునందు పాల్గొనవచ్చును. కోర్టువారి షరతులకు లోబడి వేలము జరుప బడును.

షెడ్యూలు

అనంతపురము రిజిష్టరు డిస్ట్రిక్, గుంతకల్లు సబ్. రిజిష్టరు డిస్ట్రిక్ట్ కు చేరిన గుంతకల్లు గ్రామం పొలంలో గల భూమి వివరం.
బాబు: సర్కారు పుంజి, సర్వే:నెంబర్:369 సి, ఎ. సి:4-22 పైకి గుంతకల్లు మున్సిపల్ బెంజ్ కొట్టాలకు తూర్పు దిశన గల రెసిడెన్షియల్ ఏరియా లో కొత్త వార్డు:5, ప్రస్తుతం వార్డు 6 డోర్ నం: నెంబరు. 610 కి ఉత్తర దిశలో గల ప్లాట్ నెంబరు:78 గల బైలు స్థలమునకు హద్దులు :తూర్పు - ప్లాట్ నెంబరు79 గల స్థలము.
పడమర:ప్లాటనెంబరు 77 గల స్థలముఉత్తరం :ప్లాట్ నెంబరు. 70 గల స్థలము దక్షిణం :20 అడుగులు రోడ్డు ఈ మధ్యగల - బైలు స్థలమునకు కొలతలు -
తూర్పు - పడమర : 20 అడుగులు లేక 6.09 మీటర్లు
ఉత్తరం - దక్షిణం : 60 అడుగులు లేక 18.28 మీటర్లు
వెరసి 133:33 చదరపు గజాలు
డిక్రీ హోల్డర్ విలువ రూ:6,00,000/-
అమీనా విలువ. రూ. 7,50,000/-
మా ర్కెట్ విలువ: రూ. 2,93,326/
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
ఎం. శ్రీనివాసులు, బి. లక్ష్మీ నారాయణ
డిక్రీహోల్డర్ న్యాయవాదులు గుత్తి- అనంతపురము జిల్లా
సెల్: 98481 65583.

ర్యాపిడో కార్యాలయం ముట్టడి

చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఆందోళన చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలోని 1వరోడ్డులో ఉన్న ర్యాపిడో కార్యాలయాన్ని సిఐటియు, ఎఐఎఫ్‌టియు ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో నాయకులు, ఆటో డ్రైవర్‌లు ముట్టడించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ చదువుకుని ఉద్యోగాలు లేక ఉపాధి అవకాశాలు దెబ్బతిని నగరంలో బ్రతుకుదామని వచ్చి ఇక్కడ ఆటో డ్రైవర్లుగా నిజాయితీగా జీవిస్తు కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. ఎక్కడో ఒక సంస్థను ఏర్పాటు చేసుకుని పెద్ద ఎత్తున త కడుపులు కొడుతున్న ర్యాపిడో సంస్థపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. ర్యాపిడో నుంచి ప్రభుత్వానికి ఒక్క రూపాయి ఆదాయం రావట్లేదని తెలిపారు. పోలీసుల సమాచారంతో రోడ్డు రవాణా శాఖ ఎంవిఐ సునీత ర్యాపిడో కార్యాలయం వద్ద చేరుకుని కార్యాలయ సిబ్బందికి ర్యాపిడో సర్వీస్ చేపడుతున్న ద్విచక్ర వాహనాలు, ఆటోల సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతపురంలోనే చట్ట విరుద్ధంగా దాదాపు 14 వేల టూ వీలర్స్ ర్యాపిడో సర్వీస్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఇందులో అత్యధిక వాహనాలకు ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేనట్లు గుర్తించారు. వాహనం ఒకరి పేరు మీద ఉంటే యాప్ ఇంకొకరి పేరు మీద రిజిస్టర్ చేసుకుని వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. ఎంవిఐ సునీత స్వయానా ర్యాపిడో బుక్ చేయించి ఈ విషయాన్ని ప్రత్యక్షంగా గుర్తించారు. ఫిట్నెస్ సర్టిఫికేట్ లేని ఆటోలు దాదాపు 2900 పైబి ఉన్నట్లు గుర్తించారు. ఇన్స్పెక్టర్ తక్షణమే 24 గంటలలో టూవీలర్, ఆటోలకు సంబంధించిన ర్యాపిడో అనుమతికి చెందిన రికార్డ్స్‌ను అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ విషయం పై పూర్తి సమాచారం వచ్చేంత వరకు ర్యాపిడో బంద్ చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఒక వేళ రాపిడో ఆన్ చేస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా వాహన తనిఖీ అధికారి సునీత ఆటో యూనియన్ కార్మికులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆటో కార్మికులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు భగత్‌సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు షేక్ అజాం బాషా, కార్యదర్శి ఎన్టీఆర్ సీనా, కోశాధికారి ఎస్.ఆదినారాయణ, మహిళా కన్వీనర్ స్వాతి, ఎఐఎఫ్‌టియూ ఆటో యూనియన్ నగర అధ్యక్షులు హాజీవలి, కార్యదర్శి రాజు, రైతు కులీ సంఘం నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, ఆటో యూనియన్ నాయకులు బంగారు నాగరాజు, సురేష్, వడ్డే నాగరాజు, రఘు, సీనా, మదార్‌వలి తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు సిఐకి తప్పిన ప్రమాదం

ఊడి పడిన కారు టైరు

ప్రజాశక్తి-పుట్లూరు

దెబ్బతిన్న సిఐ కారు

విధి నిర్వహణలో సిఐ సత్యబాబుకు పెనుప్రమాదం తప్పింది. విధి నిర్వహణలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన బొలెరో వాహనంలో ఎస్.గూడూరు నుంచి పుట్లూరుకు వస్తుండగా మార్గమధ్యలో ఆక్సిల్ కట్ అయ్యి ముందు టైరు కింది పడింది. అయితే ఆ సమయంలో వాహనం నిదానంగా వస్తుండటంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఇకపోతే ప్రభుత్వం మొరాయిస్తున్న వాహనాలను కేటాయించడం వల్లే ఈ పరిస్థితి వస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా జిల్లాలోనే ఫ్యాక్షన్ మండలాలైన పుట్లూరు, యల్లనూరు మండలాల్లో విధులు నిర్వహించే పోలీసు అధికారులకు ఇలాంటి వాహనాలు ఇస్తే ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కండిషన్‌లో ఉన్న వాహనాన్ని మంజూరు చేయాలని పోలీసులతోపాటు మండల ప్రజలు కోరుకుంటున్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

బిసి వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారికి ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

బిసి సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తరిమెల గిరి, ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగంలో ఉన్న సమస్యలు తెలుసుకునేందుకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా జీపుయాత్ర నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, బీసీ, ఎస్టీ సంక్షేమ హాస్టల్లో సమస్యలను తెలుసుకున్నామన్నారు. తాడిపత్రి ఎస్సీ సంక్షేమ హాస్టల్‌లో మినరల్ వాటర్ ప్లాంట్ ఉన్న దాని ప్రారంభించలేదన్నారు. కాంపౌండ్ వాల్ లేకపోవడంతో హాస్టల్‌లో పాములకు పందులకు చీడపురుగులకు ఆవాసాలుగా మారాయని తెలిపారు. గుత్తి పట్టణంలో ప్రభుత్వ బాలికల పాఠశాలకు వెళ్లే విద్యార్థునులు ఎస్సీ సంక్షేమ హాస్టల్ నుంచి దాదాపు రెండున్నర కిలోమీటర్ దూరం ప్రయాణించాల్సిన పరిస్థితులు ఉన్నాయని, ఆ హాస్టల్ కు రవాణా సౌకర్యం కల్పించేలా ఆర్టీసీ వారితో మాట్లాడాలన్నారు. గుంతకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అనుబంధంగా గతంలో బాలికలకు హాస్టల్ ఉండేదనీ కరోనా కాలంలో ఆ హాస్టల్‌కు అద్దె చెల్లించలేక మూసివేసిన పరిస్థితి ఉందన్నారు. తక్షణమే ఆ హాస్టళ్లను ప్రారంభించాలన్నారు. ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అనుబంధంగా గర్ల్స్ హాస్టల్ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ బీసీ బాలుర సంక్షేమ హాస్టళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని ఆ హాస్టళ్లను పునర్ నిర్మించాలన్నారు. ఆత్మకూరులో కూడా జూనియర్ కళాశాల అనుబంధంగా హాస్టల్స్ ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కళ్యాణదుర్గం హాస్టల్‌లో తోటలో ఉందని దానిని జనావాసాల్లో ఏర్పాటు చేసే దిశగా పరిష్కారం చూపాలన్నారు. అన్ని ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో మినరల్ వాటర్ సదుపాయం కల్పించాలన్నారు. గార్లదిన్నె, ఆత్మకూరు, ఉరవకొండ, ప్రాంతాలలో కొత్తగా హాస్టల్లో ఏర్పాటు చేయించాలన్నారు. ఈ సమస్యలను వీలైనంత తొందరగానే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి శివ, నాయకులు విజయ్, ఓము, జయవర్ధన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

దేనికోసం కోటి సంతకాలు..!

అభివృద్ధిని అడ్డుకోవడానికా.. : ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

వైసిపి నాయకులు దేనికోసం కోటి సంతకాలు సేకరిస్తున్నారో ప్రజలకు చెప్పాలని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో పలు కాలనీల్లో రూ.1.25 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ఆపేందుకే వైసిపి కోటి సంతకాల సేకరణ చేపట్టిందని విమర్శించారు. ప్రయివేటీకరణ అంటే అభివృద్ధి జరుగుతున్నట్టే అన్నారు. ప్రయివేటీకరణ చేస్తే తప్పేముందని నిలదీశారు. ముఖ్యంగా తాము పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుంటూ మాజీ ఎమ్మెల్యే మాత్రం రోడ్లపై రావడం బాధాకరమన్నారు. ఒకసారి 'ఫ్యాక్షన్ మొదలు పెడతా' అన్నందుకే తాడిపత్రిలో ఇంటికి పంపారని, మళ్లీ ఫ్యాక్షన్ చేస్తా అంటే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఆయనకు ఎవరు సలహా ఇస్తున్నారోగానీ.. మొదట సలహాదారులను మార్చుకోవాలని సూచించారు. ఫ్యాక్షన్ చేయాలంటే ఆయనే రోడ్డుపైన కత్తి పట్టి తిరగాల్సి వస్తుంది తప్ప.. ఆయన వెంట ఎవరూ రారన్నారు. గత ఐదేళ్లుగా పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థను అస్తవ్యస్తంగా మార్చారన్నారు. తిరిగి పునర్ నిర్మించడానికి సిఎం చంద్రబాబుతో మాట్లాడి రూ.11కోట్లు మంజూరు చేయించామన్నారు. డ్రెయినేజీ వ్యవస్థలో నాలుగు వేల మాన్‌హోల్స్ ఉన్నాయన్నారు. 20 అడుగుల మేర లోతు ఉన్న వాటిలో పూడిక తీయడం కష్టతరంగా మారిన నేపథ్యంలో రూ.90 లక్షలతో మిషన్ కొనుగోలు చేయబోతున్నాం. ఆరునెలల్లో డ్రెయినేజీ వ్యవస్థను గాడిలో పెట్టే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కౌన్సిలర్లు, నాయకులు, పాల్గొన్నారు.

సిసి రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-గుత్తి

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపి, ఎమ్మెల్యే

మండలంలోని కరిడికొండ గ్రామ శివారులో లక్ష్మీనరసింహ ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ బుధవారం ప్రారంభించారు. గ్రామ శివారులో కొండపై ఉన్న ఆలయానికి భక్తులు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉండటంతో సింగిల్ విండో మాజీ అధ్యక్షులు కరిడికొండ సూరి, టిడిపి నాయకులు ఎన్ సుధాకర్ నాయుడు,ఎన్ ప్రభాకర్ నాయుడు, గిరిధర్ నాయుడు రోడ్డు నిర్మించాలని కోరారు. స్పందించిన ఎంపీ తన నిధుల నుంచి రూ.10లక్షలు మంజూరు చేశారు. పనులు పూర్తి కావడంతో రోడ్డును ప్రారంభించారు. ముందుగా ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు జి.వెంకటశివుడు యాదవ్, మార్కెట్ యార్డు ఛైర్మన్ జి.సూర్యప్రతాప్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చికెన్ శీనాయాదవ్, పిఆర్ డిఇఇ డిఎల్ మురళీధర్, ఎఇ మల్లేష్‌నాయక్, డిఎల్‌డిఓ విజయలక్ష్మి, సర్పంచు పి.భరత్‌కుమార్, ఎంపిటిసి ఎం.ధనుంజయ, కార్యదర్శి ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పిఎంఎవై ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

ప్రజాశక్తి-రాయదుర్గం

భూమిపూజ చేస్తున్న కాలవ శ్రీనివాసులు

పిఎంఎవై అర్బన్ (2.0) పథకం కింద కొత్త ఇళ్ల నిర్మాణానికి బుధవారం పట్టణంలోని 32వ వార్డులో లబ్ధిదారులతో కలిసి విప్ శ్రీనివాసులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.1.5లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష మంజూరు చేయనున్నట్లు తెలిపారు. పేదలందరికీ సొంతిళ్లు నిర్మించి ఇవ్వాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అలాగే పట్టణంలోని 31వ ఎన్నికల వార్డు శాంతినగర్‌లో పిఎంఎవై అర్బన్ 1.0 పథకం కింద నిర్మించిన లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, వార్డు సభ్యురాలు ప్రశాంతి, మాజీ సభ్యులు హనుమంతు, భారతి, కృష్ణమూర్తి, నాయకులు రాజశేఖర్, తిప్పేస్వామి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

ప్రత్యేక అదాలత్‌లో సిపిఎం వినతి

ప్రజాశక్తి-గుంతకల్లు

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ కోరారు. ఈమేరకు పట్టణంలోని ఆలూరు రోడ్డులో ఉన్న విద్యుత్ శాఖ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక అదాలత్‌లో సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో అనేక చోట్ల విద్యుత్ సమస్యలు ఉన్నా అధికారులు పరిష్కరించడం లేదని ఫిర్యాదు చేశారు. ప్రధానంగా సిఐటియు కాలనీ, మస్తాన్‌పేట, ఆర్ అండ్ బి సర్కిల్ ప్రాంతాల్లో రెండేళ్ల క్రితం స్తంభాలు ఏర్పాటు చేసి ఇంతవరకు విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయలేదన్నారు. ప్రశాంతినగర్, భీమిలింగ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు లేక వందల మీటర్ల దూరం నుంచి సర్వీస్ వైర్ తీసుకుని మీటర్లు ఏర్పాటు చేసుకున్నారన్నారు. మోదీనాబాద్, నాయీబ్రాహ్మణ కాలనీలో నల్లరేగడి భూమి వల్ల విద్యుత్ స్తంభాలు కింద పడిపోయాయని వాటిని సరి చేయాలన్నారు. ధోనిముక్కల రోడ్డు లేఅవుట్ నెంబర్ 12 వద్ద 30 కుటుంబాలకు విద్యుత్ సరఫరా అవకాశాలు లేక చీకటిలో ఉంటున్నారన్నారు. నాగసముద్రం బావి వద్ద ఎల్‌టి లైన్ కేవలం ఐదు అడుగుల ఎత్తులో ఉండి ప్రమాదకరంగా ఉందన్నారు. విద్యుత్ అధికారులు వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రజలందరినీ కలుపుకుని ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు సాకే నాగరాజు, సురేంద్రబాబు, పట్టణ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, ఓబులేసు, అబ్దుల్లా, సూరి, ఖాదర్, ఈరన్న, రవి, ఓబులేసు, లక్ష్మీదేవి, షకీరా, సుబ్బు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు పరిశీలన

యల్లనూరు : మండల పరిధిలోని 85 నిట్టూరు గ్రామ పంచాయతీలో చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను ప్రాజెక్టు డైరెక్టర్ సలీంబాషా బుధవారం పరిశీలించారు. ఇందులో భాగంగా డగౌట్ పాండ్స్ పనులను పరిశీలించి కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూలీల శాతం తక్కువ ఉన్న పంచాయతీల్లో కూలీలకు పనులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఓ ఓబులరెడ్డి, ఇసి సత్యమూర్తి, టెక్నికల్ అసిస్టెంట్లు జయరాం, కుళ్లాయిస్వామి, హరికుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జీవన్ ప్రసాద్, పురుషోత్తమ నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

అనంతపురం : అనంతపురం రూరల్ మండలం పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్సెస్ ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్కెయు ఉపకులపతి బి.అనిత, రెక్టార్ వెంకటనాయుడు, శ్రీ శివసాయి హాస్పిటల్స్ వైద్యులు ఎస్.గౌరీశంకర్, ఎన్ఎస్ఎస్ సమన్వయ కర్త డి.మురళీధరరావు, ఎస్కెయు డిఓఇ జి.వెంకట రమణ, ఎస్కెయు సిబిపిఎస్ డైరెక్టర్ పి.వెంకట రమణ, ప్రిన్సిపాల్ జి.సోమశేఖర్, బి.ఫార్మసీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి ఇంటింటి సర్వే : డిఎంహెచ్‌ఓ

ప్రజాశక్తి-అనంతపురం

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిఎంహెచ్‌ఓ

కుష్టువ్యాధి నిర్ధారణ కోసం ఈనెల 17 నుంచి 30వతేదీ వరకూ ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు డిఎంహెచ్‌ఓ డాక్టర్ ఇబి దేవి తెలిపారు. ఈమేరకు బుధవారం తన ఛాంబర్‌లో కుష్టు నివారణపై అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో కుష్టువ్యాధి అపోహలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. 17 నుంచి 30వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా వైద్య సిబ్బంది ప్రతి ఇంటినీ సందర్శించి కుష్టువ్యాధి సోకిన వారిని గుర్తించనున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కుష్టు, టిబి, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ బి.జయలక్ష్మి, వైద్యులు శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ స్వామి, గంగాధర్‌రెడ్డి, విష్ణుమూర్తి, డెమో నాగరాజు, త్యాగరాజు, గంగాధర్, విన్నర్‌వీల్ పెసిడెంట్ జయంతి, శ్రీవల్లి, పద్మ, దేవప్రసాద్, నాగన్న, రామదాసు, తదితరులు పాల్గొన్నారు.

104 సిబ్బంది సమయపాల పాటించాలి

104 సిబ్బంది సమయపాలన పాటించాలని డిఎంహెచ్‌ఓ ఇబి దేవి సూచించారు. బుధవారం తన కార్యాలయం నుంచి 104 సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వాహనంతో పాటు సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విష్ణుమూర్తి, 104 వాహన జిల్లా మేనేజర్ కిశోర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్లు నిర్మించడమే లక్ష్యం : ఎమ్మెల్యే

ఇళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం : పేదలందరికీ ఇళ్లు నిరించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. బుధవారం మండలంలోని అమ్మవారి పేట గ్రామం పేదలు నిర్మించుకుని పక్కా గృహాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతి పేదవాడికీ పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నదే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దాసరి సునీత, పొడరాళ్ల రవీంద్ర, ఓబుళపతి, దండువారిపల్లి ఆదినారాయణ, పసలూరు రామకృష్ణారెడ్డి, వాసుదేవరెడ్డి, సోమశేఖర్, డీలర్ సుధాకర్, కేకే అగ్రహారం రాము, ఆర్‌డిఓ కేశవనాయుడు, తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, డిప్యూటీ ఎంపిడిఓ సదాశివ, హౌసింగ్ డిఇ రామ్మూర్తి, సిఐ పుల్లయ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలకు అదనపు సీట్ల మంజూరుపై హర్షం

అనంతపురం : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అదనంగా 15 పీజీ సీట్లు కేటాయింపుపై ప్రిన్సిపాల్ ఆచార్య విజయశ్రీతోపాటు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గైనిక్ విభాగాధిపతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శంషాద్‌బేగం, పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ రవికుమార్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డాక్టర్ సౌరి, ఎన్ఎంసి కమిటీ సభ్యులు ప్రవీణ్ దిన్, ప్రవీణ, పద్మ శ్రావణి, తదితరులు ప్రిన్సిపాల్‌తోపాటు సూపరింటెండెంట్ కెఎల్ సుబ్రమణ్యం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.షారోన్ సోనియాను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు సుచిత్ర, పాత్రుడు, భాస్కర్, అసోసియేట్ ప్రొఫెసర్లు మధుసూదన్, రేణుక, నిస్సార్ బేగం, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి కోర్టుకు హాజరైన సినీనటుడు రాజ్‌కుమార్

కోర్టు వద్ద ఉన్న రాజ్‌కుమార్

గుత్తి : గుత్తిలోని న్యాయస్థానానికి బుధవారం సినీ నటుడు,టిడిపి నేత రాజ్ కుమార్ హాజరయ్యారు. 2009 సాధారణ ఎన్నికల ప్రచారంలో అనుమతి లేకుండా జాతీయ రహదారిపై రోడ్డు షో నిర్వహించారని కేసులో ఆయన కోర్టుకు వచ్చారు. ఆయనతో పాటు రాష్ట్ర మాంసం అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చంద్రదండు ప్రకాష్ నాయుడు న్యాయస్థానానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని టిడిపి పట్టణ కార్యదర్శి బి.మారుతీప్రసాద్, నాయకులు కోనంకి కృష్ణ, న్యాయవాది సోము, మండల నాగరాజు,బోయ రమేష్,మల్లి,భీమా, శ్రీదేవి తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు.

ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలి : ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు

గుంతకల్లు : నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పని చేసి త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక బలిజ కళ్యాణ మండపంలో మండల క్లస్టర్ యూనిట్ బూత్ కమిటీల సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం టిడిపి మండల అధ్యక్షులు బండారు రామన్న చౌదరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి నాయకులు వైద్య కళాశాలలపై కోటి సంతకాల కార్యక్రమం ఉనికి కోసమే అన్నారు. వైసిపి ప్రచారాన్ని టిడిపి కుటుంబ సభ్యులు తిప్పి కొట్టాలన్నారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి, పట్టణ అధ్యక్షులు ముక్కన్నగారి గుణశేఖర్, జిల్లా టిడిపి డాక్టర్ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ హిమబిందు కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఇఓ

గుత్తి : జిల్లా ఎంఇఓ పి.వేణుగోపాల్, బి.రామ నారాయణ స్వామి జక్కలచెరువు ఆర్ఎస్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించారు. విద్యార్థుల సమగ్రాభివద్ధి కోసం ఉపాధ్యాయులకు పలు మార్గదర్శక సూచనలు ఇచ్చారు.

శింగనమల చెరువు మరవలో కంపచెట్ల తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-శింగనమల

కంపచెట్లను తొలగిస్తున్న కార్మికులు

మండల కేంద్రం సమీపంలో ఉన్న శింగనమల చెరువు మరువలో ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించారు. చెరువు మరువలో పెరిగిన కంపచెట్లపై ఇటీవల ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాలతో స్థానిక టిడిపి నాయకులు చెరువు మరువలో పెరిగిన కంపచెట్లను తొలగించారు.

నేరాలు ఘోరాలు

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుత్తి : పట్టణంలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ బాలుర కళాశాల వసతి గృహంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి (45) మృతి చెందాడు. కోనేళ్లుగా వసతి గృహం మూతపడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు రెండు రోజులుగా ఆ వ్యక్తి అక్కడే ఉంటున్నాడు. అనారోగ్య సమస్యలతో మరణించి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

భర్త దాడి... భార్యకు గాయాలు

కళ్యాణదుర్గం రూరల్ : భార్యపై భర్త కత్తితో దాడి చేసిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కళ్యాణదుర్గం మండల పరిధిలోని బోరంపల్లి గ్రామంలో హరిజన రత్నమ్మను అనుమానంతో భర్త ఎర్రిస్వామి కత్తితో గొంతు కోశాడు. విషయం తెలుసుకున్న బంధువులు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని విచారిస్తున్నారు.

మట్కా నిర్వాహకుడు అరెస్టు

కళ్యాణదుర్గం రూరల్ : కంబదూరు మండలంలోని వైసి.పల్లి గ్రామంలో మట్కా నిర్వహిస్తున్న సుధాకర్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సుధాకర్ మట్కా నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతోపాటు మట్కాకు వినియోగిస్తున్న మొబైల్, రూ.36,150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

గుత్తి : మండలంలోని ఈశ్వరపల్లి గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన లాలూస్వామి కొన్ని రోజులుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. ఈక్రమంలో పలు ఆసుపత్రులలో చికిత్స చేయించుకున్నా వ్యాధి నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన లాలూస్వామి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బసినేపల్లిలో మహిళ..

గుత్తి : మండలంలోని బసినేపల్లి గ్రామంలో బుధవారం ఓ మహిళ కుటుంబ సమస్యలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా మేరకు గ్రామానికి చెందిన భారతి గత కొన్ని రోజులుగా కుటుంబ సభ్యులతో పాటుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారి సాయికుమార్

వరిపంటలో చీడపీడల నివారణకు చర్యలు

బొమ్మనహాల్ : మండలంలోని విస్తారంగా సాగయ్యే వరిపంటకు ఆశించి చీడపీడలపై వ్యవసాయ శాఖ అధికారులు నివారణ చర్యలను వివరించారు. బుధవారం మండలంలోని ఎలంజి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి సాయికుమార్ మాట్లాడుతూ రైతులు అతిగా క్రిమిసంహారక మందులను పిచికారి చేయరాదన్నారు. రైతులు అధికారుల సలహాలు సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభలు సద్వినియోగం చేసుకోండి

బెలుగుప్ప : రీ సర్వేలో రైతులకు భూ సమస్యలు ఉంటే గ్రామసభల్లో దరఖాస్తు చేసుకుని పరిష్కరించుకోవాలని తహశీల్దార్ బి.అనిల్‌కుమార్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని గంగవరం, కూనంపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రీసర్వేలో జాయింట్ భూములు, వెడల్పు విస్తీర్ణంలో హెచ్చుతగ్గులుంటే పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అనిల్‌కుమార్ డీటీ గురుబ్రహ్మ, వీఆర్వో రాజశేఖర్, సర్వేయర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ పూర్తి చేయండి : ఎపిఒ

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలకు తప్పనిసరిగా ఈకెవైసి పూర్తి చేయాలని ఎపిఒ తులసీప్రసాద్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఎపిఒ మాట్లాడుతూ ఈకెవైసి చేయడంలో మండలం చాలా వెనకబడి ఉందన్నారు. త్వరగా వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇసి అంజనకుమార్, టిఎలు, బిఎఫ్‌టిలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేత

అనంతపురం : తన కుమారుడు డాక్టర్ అర్షద్ అయూబ్ జ్ఞాపకార్థం నగరంలోని డాక్టర్ కెఎస్ఎఆర్ గఫూర్ హాస్పిటల్ అధినేత రజాక్ గఫూర్ బుధవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక బేరాక అనాథ, వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది డాక్టర్ మమతశ్రీ, మేనేజర్ షబ్బీర్, మల్లేశ్వరి, నర్సులు నవ్య, హారిక, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

'అక్షరాంధ్ర'పై శిక్షణ

యల్లనూరు : మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో అధ్యాపకులు తాడిపత్రి క్లస్టర్ ఇన్‌ఛార్జి లక్ష్మీనారాయణ గ్రామ సమాఖ్య సంఘం యానిమేటర్లు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు బుధవారం అక్షరాంధ్రపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం ముత్యాలప్ప, స్త్రీనిధి మేనేజర్ రంగస్వామి, ఎపిఒ ఓబుళరెడ్డి, ఇసి సత్యమూర్తి, సీసీలు పుల్లయ్య, మురళి, టెక్నికల్ అసిస్టెంట్లు, యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ ఇస్తున్న దృశ్యం

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ఆపాల్సిందే..

ప్రజాశక్తి-శింగనమల

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరించేందుకు కూటమి ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వైసిపి నియోజవకర్గ సమన్వయకర్త డాక్టర్ శైలజనాథ్ అన్నారు. వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా ఉద్యమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని దర్గా నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వీరికి సిపిఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరిస్తే పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేసినట్లే అన్నారు. కావున కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని యథావిధిగా ప్రభుత్వం ద్వారానే నడపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బొమ్మన శ్రీరామిరెడ్డి, చాగంటి గురుమూర్తిరెడ్డి, బొమ్మన భాస్కర్‌రెడ్డి, బొమ్మన గోపాల్‌రెడ్డి, కొప్పెర్ల గొల్లారెడ్డి, తరిమెల వంశీ గోకుల్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దయ్య, వైసిపి మండల కన్వీనర్ పూల ప్రసాద్, నాయకులు మిద్దె కుళ్లాయప్ప, నారాయణరెడ్డి, గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, చామలూరు రాజగోపాల్, భాస్కర్‌రెడ్డి, బంగారు అలిబాషా, అబ్దుల్లా, మల్లికార్జునరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : పట్టణంలోని వైసిపి కార్యాలయం నుంచి గాంధీచౌక్, టీసర్కిల్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకూ వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు మహేంద్రారెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, సూరి, కృష్ణమూర్తి, దొడగట్ట నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా ఉద్యమం'లో వైసిపి నాయకులు

కళ్యాణదుర్గంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి శ్రేణులు

గుంతకల్లు : మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త వై.వెంకట్రామిరెడ్డి వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా ఆర్‌డిఒ కార్యాలయం వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డికి వినతిపద్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ నంగినేని భవాని, వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతీరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గాదులింగేశ్వర బాబు, పట్టణ, మండల కన్వీనర్లు ఖలీల్, రాము, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు జింకల రామాంజనేయులు, గుత్తి ఎంపిపి విశాలాక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణను నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని వినాయక కూడలి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహిచారు. ఈ సందర్భంగా తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి పరిశీలకులు మోహన్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు మెట్టు విశ్వనాథరెడ్డి, ఉషారాణి, నాయకులు పోరాళు శిల్ప, గౌని ఉపేంద్రరెడ్డి, శ్రీనివాసులు, రామాంజనేయులు, లక్ష్మీకాంతరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రవీంద్రారెడ్డి, నాగరాజురెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, బిటిపి గోవిందు, చుంచుల నాగప్ప, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు యాడికి మండల కేంద్రంలో బుధవారం వైసిపి నాయకులు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బాల రమేష్‌బాబు, బొంబాయి రమేష్ నాయుడు, వెన్నపూస వెంకట రామిరెడ్డి, నగరూరు బ్రహ్మానందరెడ్డి, సంజీవరాయుడు, నియోజకవర్గవ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతపురం : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో బుధవారం ఉరవకొండలో నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక పార్కు ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ తహశీల్దార్ కార్యాలయం వరకూ సాగింది. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, నాయకులు కెవి రమణ, వీరన్న, నరసింహులు, సుశీలమ్మ, తిప్పయ్య, ఎర్రిస్వామి, ఈడిగ ప్రసాద్, డి.సురేష్, గందోడి మారేష్, బసవరాజు, అశోక్ కుమార్ జగదీష్, అమిలినేని సునీల్, గోవిందనాయక్, ఎర్రిస్వామిరెడ్డి, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ డిగ్రీ కళాశాల విద్యార్థుల శ్రమదానం

శ్రమదానం చేస్తున్న విద్యార్థినులు

అనంతపురం : ఎస్వి డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని బి.యాలేరు గ్రామంలో శ్రమదానం చేశారు. ఇందులో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఆర్డీటీ పాఠశాల ఆవరణ, గ్రామ ప్రధాన రహదారుల్లో శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు ఎ.రేణుకమ్మ, ఎ.ఎర్రిస్వామి, పంచాయతీ కార్యదర్శి మురళీధర్, పిఒలు జి.ఆనంద్‌బాబు, టి.సుదర్శనరెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.

రీ సర్వేలో లోటుపాట్లను సరిదిద్దుకోండి : డిఎస్‌డిఒ

బొమ్మనహాల్ : గ్రామాల్లోని ప్రజలు ఇళ్లు, స్థలాల్లో ఉన్న లోటుపాట్లను రీసర్వేలో సరిదిద్దుకోవాలని డిఎల్‌డిఒ నాగేశ్వరరావు సూచించారు. బుధవారం మండలంలోని కొళగానహళ్లి, మైలాపురం గ్రామాల్లో గ్రామ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొళగానహళ్లి పంచాయతీ పరిధిలో 434 గృహాలు ఉన్నాయన్నారు. వీటికి రీసర్వేలో హద్దులు గుర్తించనున్నట్లు తెలిపారు. వీటిలో ఏమైనా లోపాలు ఉంటే 12 రోజుల్లోపు ఫిర్యాదు చేసుకుని సరిచేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ పంచాయతీ కార్యదర్శి అశోక్, సచివాలయ సిబ్బంది, సర్వేయర్లు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడికి సన్మానం

అంజనప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

గుత్తి : ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడిగా ఎన్నికైన అంజనప్రసాద్‌ను బుధవారం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, తిమ్మారెడ్డి, రంగరాజు, గుత్తి కోట సంరక్షణ సమితి నాయకుడు పి.వెంకటరామిరెడ్డి, భగత్‌సింగ్ కమిటీ నాయకుడు నిజాముద్దీన్, బీఎస్పీ నాయకులు ఎం.రామాంజనేయులు, సిపిఐ మండల కార్యదర్శి జి.రామదాసు, ఎంఆర్‌పిఎస్ నాయకులు కాశీరావు, కోటేశ్వరరావు, లాలెప్ప, అడవి రాముడు, సామాజిక కార్యకర్తలు బాచి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల సంక్షేమాధికారుల జెఎసి ఏర్పాటు

ఛైర్మన్‌గా ఎస్.రామునాయక్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ సంక్షేమ శాఖల వసతి గృహాల సంక్షేమాధికారుల జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి)ని ఏర్పాటు చేసినట్లు ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఛైర్మన్ ఎస్.రామునాయక్ తెలిపారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని సంక్షేమ హాస్టళ్ల సంక్షేమాధికారుల జెసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంక్షేమాధికారుల సర్వీస్ మేటర్స్, వారు ఎదురుకుంటున్న సమస్యలపై చర్చించి, సమస్యల పరిష్కారం కోసం జెఎసిగా అందరి ఆమోదయోగ్యముతో ఏకగ్రీవంగా ఏర్పాటైంది. ఛైర్మన్‌గా ఎస్.రామునాయక్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సి.మస్తాన్, జనరల్ సెక్రటరీగా ఇఎన్.మారుతీప్రసాద్, జిల్లా కోశాధికారిగా పి. సురాంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సిపి.చంద్రశేఖర్ బాబు, ఉపాధ్యక్షులుగా ఎ.రాజశేఖర్ నాయుడు, జి.నాగమణి, కె.రామంజుల రెడ్డి, కె.భయపరెడ్డి, టి.గురుప్రసాద్, కె.అశ్వర్థ, సంయుక్త కార్యదర్శులుగా కె.సాహింతాజ్, జి.జగన్నాథ్, సి.నాగరాజు, ఈ.గోవిందరెడ్డి, జి.ఈరన్న, కె.ఆదినారాయణ, బి.బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న జెఎసి నాయకులు

విద్యారంగాన్ని పరిరక్షించుకుందాం

ఎఐఎస్ఎఫ్ బస్సుయాత్ర ముగింపు సభలో వక్తల పిలుపు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రస్తుతం రాష్ట్రంలో విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉఎఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ఉపాధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. విద్యారంగ పరిరక్షణ కోసం అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బస్సుజాత బుధవారం అనంతపురంలో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగాన్ని పరిరక్షిస్తామని ఎన్నికలకు ముందు యువగలం పాదయాత్ర పేరుతో నేటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఊరూరా తిరిగి విద్యార్థులతో ముఖాముఖి ఏర్పాటు చేసి అనేక వాగ్దానాలు చేశారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నియంత పోకడలతో కనీసం విద్యార్థులతో చర్చలు జరుపుకుంటా ఉద్యమాన్ని నీరుగార్చే విధంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వంపై ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బిందెల నాసర్ జి, జాతీయ కార్యదర్శి శివారెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వలరాజు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.జాఫర్, సిపిఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి, జిల్లా సహాయ కార్యదర్శులు చిరుతల మల్లికార్జున, జె. రాజారెడ్డి, ఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ చలపతి, మస్తాన్, ఫణీంద్ర, నాగభూషణం, సాయి, సాబీర్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.